క్లుప్తంగా

ఈటల రాజేందర్‌కు శుభాకాంక్షల వెల్లువ



శాలువ కప్పి సత్కారిస్తున్న సత్యనారాయణ

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర బీజేపీ ఎన్నికల కమిటీ చైర్మన్, మల్కాజిగిరి లోక్‌సభ అభ్యర్థి ఈటల రాజేందర్ జన్మదిన వేడుకలకు ఇబ్రహీంపట్నం నియోజకవర్గ నేతలు బుధవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా రాజేందర్‌కు శాలువ కప్పి, కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. గంగనమోని సత్యనారాయణ, మహేశ్, ప్రవీణ్, రమేశ్, జగన్‌లు పాల్గొన్నారు.

కాలయాపనకే ధరణి స్పెషల్‌డ్రైవ్

రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి మధుసూదన్‌రెడ్డి

యాచారం: ధరణి స్పెషల్‌డ్రైవ్‌తో కాలయాపన తప్పా భూ సమస్యలు పరిష్కారాం కావడం లేదని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 1 నుంచి ధరణి స్పెషల్ డ్రైవ్ పెట్టిన సర్కార్ రెవెన్యూ అధికారులకు భూ సమస్యలు పరిష్కరించే లాగిన్లు ఇవ్వకుండా జాప్యం చేయడంలో అర్థం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ధరణి స్పెషల్‌డ్రైవ్‌తో ఏ మండలంలో కూడా భూ సమస్యలు పరిష్కారాం కాలేదన్నారు. సర్కార్‌కు చిత్తశుద్ధి ఉంటే తహసీల్దార్లకే లాగిన్లు ఇచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

బాధిత కుటుంబానికి చేయూత



బాధిత కుటుంబసభ్యులకు నగదు అందజేస్తున్న జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి

షాబాద్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబానికి అండగా ఉంటామని షాబాద్ జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని బొబ్బిలిగామ గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆవుల మల్లేశ్, నవనీత దంపతుల కుటుంబసభ్యులను పరామర్శించి తక్షణ సాయంగా రూ.20వేల నగదు అందజేశారు. పిల్లలను అన్ని విధాలుగా ఆదుకుంటామని చెప్పారు. తల్లిదండ్రులు చనిపోవడంతో పిల్లల చదువులు, ఇతరత్రా ఖర్చులకు ఇబ్బందులు పడకుండా తమవంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు సుధాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు వెంకట్‌రెడ్డి తదితరులున్నారు.

ఘనంగా స్వయంపాలన



ఉపాధ్యాయులతో విద్యార్థులు

కొందుర్గు: మండలంలోని బైరంపల్లి గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రజినీకాంత్‌రెడ్డి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మొయినాబాద్‌రూరల్: సాంఘిక సంక్షేమ చేవెళ్ల గురుకుల బాలికల పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నామని కళాశాల, పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ.. మండల పరిధిలోని తోల్‌కట్ట సమీపంలో గల సాంఘిక సంక్షేమ చేవెళ్ల గురుకుల బాలికల పాఠశాలలో 6, 7, 8, 9 తరగతులలో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నామని తెలిపారు. ప్రవేశ పరీక్ష దరఖాస్తుకు చివరి తేదీ ఈ నెల 23 వరకు ఉన్నట్లు సూచించారు. ఈ ప్రవేశ పరీక్ష రాష్ట్ర వ్యాప్తంగా సూచించిన పరీక్ష కేంద్రాల్లో ఏప్రిల్ 21వ తేదీన ఉంటుందని తెలిపారు. పరీక్ష పూర్తి వివరాల కోసం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల వెబ్‌సైట్‌లో సంప్రదించాలని కోరారు.

శంకర్‌పల్లి గురుకుల పాఠశాలలో..

మొయినాబాద్: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 6, 7, 8, 9వ తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మొయినాబాద్‌లోని శంకర్‌పల్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జయమ్మ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23 వరకు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆధ్యాత్మికతతో భక్తిభావం

- సీఎం రేవంత్‌రెడ్డి సతీమణి గీతారెడ్డి, ఎంపీ పోతుగంటి రాములు
- శ్రీరామ, శివపార్వతి, సరస్వతిదేవీల విగ్రహ ప్రతిష్ఠాపన
- శ్రీ మాధవానంద సరస్వతిస్వామి అనుగ్రహ భాషణం



కడ్తాల్: పూజలు నిర్వహిస్తున్న మాధవానంద సరస్వతిస్వామి, పండితులు

కడ్తాల్: ఆధ్యాత్మికతతో భక్తిభావం పెంపొందుతుందని సీఎం రేవంత్‌రెడ్డి సతీమణి గీతారెడ్డి, ఎంపీ పోతుగంటి రాములు పేర్కొన్నారు. మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని శ్రీరామేశ్వర వీరాంజనేయ క్షేత్రంలో సీజీఆర్ సంస్థ వ్యవస్థాపకులు లీలా లక్ష్మారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఆలయాల్లో బుధవారం విగ్రహాల ప్రతిష్ఠ, ధ్వజస్తంభ స్థాపన అత్యంత వైభవంగా నిర్వహించారు. తొగుట శ్రీగురు మదనానంద సరస్వతి పీఠాధిపతి మాధవానంద సరస్వతిస్వామి పర్యవేక్షణలో వేదపండితులు శ్రీ మేళ్లారి వెంకటేశ్వర శర్మ పండిత బృందం ఆధ్వర్యంలో నిర్వహించారు. శ్రీరామ, శివపార్వతులు, సరస్వతి దేవి, శ్రీచక్ర విగ్రహ, ధ్వజస్తంభం వైభవంగా ప్రతిష్ఠించారు. దీనికి ముఖ్య అతిథిగా సీఎం రేవంత్‌రెడ్డి సతీమణి గీతారెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, బోధన్ ఎమ్మెల్యే ప్రొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీ రెడ్డి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ దిలీప్‌రెడ్డి, విశ్రాంత ఆచార్యులు, ఆధ్యాత్మిక ప్రవచన కర్త, కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్, మహేశ్వర మహాపిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయ భాస్కర్‌రెడ్డి, వందేమాతరం ఫౌండేషన్ చైర్మన్ రవీందర్‌లు హాజరయ్యారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక సభలో శ్రీగురుమదనానంద సరస్వతి పీఠాధిపతి మాధవానంద సరస్వతిస్వామి భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. ఆలయాల నిర్మాణం, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో భక్తి భావం పెరుగుతుందన్నారు. నీలో వెలిగే రూపమే పరమాత్ముడని, ప్రతి మానవుడు తనలోని పరమాత్మను దర్శించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆలయాల పునర్ నిర్మాణం చేపట్టిన లీలా లక్ష్మారెడ్డి దంపతులకు ఆశీర్వచనములు అందజేశారు.



కడ్తాల్: విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి సతీమణి గీతారెడ్డి



కడ్తాల్: మాట్లాడుతున్న ఎంపీ పోతుగంటి రాములు

ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి : సీఎం రేవంత్‌రెడ్డి సతీమణి గీతారెడ్డి

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. సమృద్ధిగా వర్షాలు కురిసి, ప్రజలంతా పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని గీతారెడ్డి ఆకాంక్షించారు.

ప్రతిఒక్కరూ జ్ఞానాన్ని కలిగి ఉండాలి: లోక్‌సభ సభ్యుడు పోతుగంటి రాములు

సంస్కృతి సంప్రదాయాలకు పుట్టినిల్లు భారతదేశమని, ప్రతిఒక్కరూ జ్ఞానాన్నికలిగి ఉండాలన్నారు. ఈ ప్రాంతంలో సరస్వతి దేవి ఆలయాన్ని నిర్మించడం గొప్ప విషయమన్నారు. అనంతరం ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ, పర్యావరణ పరిర క్షణతో పాటు, ఆలయాల అభివృద్ధికి సీజీఆర్ సంస్థ నిర్వాహకులు లీలా లక్ష్మారెడ్డి దంపతులు చేపడుతున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు అతిథులను ఘనంగా సన్మానించారు. అదే విధంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పతంజలి ఆశ్రమ సాధ్వి నిర్మలానంద భారతి మాతాజీ, పీసీసీ సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, సూదినిరాంరెడ్డి, జెడ్పీటీసీలు దశరథ్‌నాయక్, విజితారెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ఎంపీపీ ఆనంద్, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, సూదిని లక్ష్మమ్మ, యాటనర్సింహ, బీక్యానాయక్, కృష్ణారెడ్డి, సుధీర్‌రెడ్డి, పాపిరెడ్డి, అరవింద్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

'మల్లు రవి' ప్రకటనపై హర్షం



మల్లురవికి ఎంపీ టికెట్ ఇవ్వడంపై సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: నాగర్ కర్నూల్ లోక్‌సభ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా డాక్టర్ మల్లు రవిని పార్టీ అధిష్ఠానం ప్రకటించడంతో జిల్లా కాంగ్రెస్ నాయకుడు రవీందర్ నాయక్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఆమనగల్లు పట్టణంతో పాటు, మేడిగడ్డ తండాలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సంబురాలు చేసుకున్నారు. మల్లు రవికి ఎంపీ టికెట్ ఇవ్వడం పట్ల పార్టీ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సురేశ్‌నాయక్, పాండునాయక్, రాజ్‌కుమార్, వసంత్, లోక్యా, నీలా, మల్యా, ద్రసు తదితరులు పాల్గొన్నారు.

మల్లు రవికి ఘన స్వాగతం

తలకొండపల్లి: మాజీ ఎంపీ మల్లు రవికి శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కాంగ్రెస్ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానాన్ని మల్లు రవికి కేటాయించినందుకు కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ, యువనాయకుడు రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గెలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

టికెట్ కేటాయించడంపై హర్షం

తలకొండపల్లి: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానాన్ని మాజీ ఎంపీ డాక్టర్ మల్లు రవికి కాంగ్రెస్ అధిష్ఠానం కేటాయించినందుకు పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి, రాష్ట్ర నాయకుడు, శతాబ్ది టౌన్‌షిప్ మేనేజింగ్ డైరెక్టర్ కాసు శ్రీనివాసురెడ్డి హర్షం వ్యక్తం చేశారు. బుధవారం హైదరాబాద్‌లో మల్లు రవిని వారు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శివలింగం, తదితరులు పాల్గొన్నారు.



శంషాబాద్: ఎయిర్‌పోర్టుల్లో మల్లు రవికి స్వాగతం పలుకుతున్న మోహన్‌రెడ్డి, తదితరులు



మల్లు రవికి సన్మానిస్తున్న నాయకులు

బీఆర్ఎస్ ఖాళీ అవడం ఖాయం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: రాష్ట్రంలో బీఆర్ఎస్ ఖాళీ అవడం ఖాయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని వీ కన్వెన్షన్ హాల్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలకు నెరవేస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు, కార్యక్రమాలకు ఆకర్షితులై చాలా మంది వివిధ పార్టీల నేతలు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. రాబోవు ఎమ్మెల్సీ, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయ ఢంకా మోగించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ, బీఆర్ఎస్‌లను ప్రజలు నమ్మడం లేదని విమర్శించారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పూర్తిగా ఖాళీ కావడం ఖాయమన్నారు. కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు తమవంతు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, విశాల, శ్రావణ్‌కుమార్‌రెడ్డి, బాబర్‌ఖాన్, వెంకట్‌రాంరెడ్డి, జమృద్‌ఖాన్, కాశీనాథ్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, హరినాథ్‌రెడ్డి, మోహన్, శివశంకర్‌గౌడ్, భార్గవ్‌కుమార్‌రెడ్డి, సుదర్శన్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీదే విజయం

నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు రాములు



ఎంపీ రాములు, భరత్ ప్రసాద్‌ను సన్మానించిన బీజేపీ నాయకులు

కడ్తాల్: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయమని ఎంపీ పి రాములు పేర్కొన్నారు. బుధవారం కడ్తాల్ మండల కేంద్రానికి విచ్చేసిన ఆయనకు, నాగర్‌కర్నూల్ లోక్‌సభ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌కు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారిని ఘనంగా సన్మానించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ పార్టీ విజయానికి కార్యకర్తలు, నాయకులు సమిష్టిగా కృషి చేయాలన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. నాగర్‌కర్నూల్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్న భరత్ ప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వీరయ్య, మండల అధ్యక్షుడు మాన్యనాయక్, జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షుడు సాయిలాల్‌నాయక్, ఏలే రమేశ్, డాక్టర్ రమేశ్, గోపాల్‌రెడ్డి, రవిరాథోడ్, మహేశ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

ఘనంగా గరుడ వాహన సేవ



తలకొండపల్లి: కల్కిదొనగుట్ట ఆలయంలో గరుడ వాహనసేవ

తలకొండపల్లి: చుక్కాపూర్ కల్కిదొనగుట్ట గోపాల స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం రాత్రి గరుడ వాహన సేవా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు కృష్ణమూర్తి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణం నుంచి గాలి గోపురం వరకు అత్యంత శోభాయమానంగా గరుడ వాహన సేవా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ట్రస్టు చైర్మన్ పట్టాభిరామశర్మ, ఆలయ ముఖ్య కార్యనిర్వాహక సభ్యులు సిద్ధాంతి కృష్ణమూర్తిశర్మ, నితిన్‌శర్మ, కృష్ణయ్య, నారాయణ, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు..

ఆమనగల్లు: పట్టణంలోని వెంకటగిరి వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఉత్సవాలలో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, సుదర్శన హవనం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలను ఆలయ అర్చక బృందం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాపిశెట్టి రాము, అర్చకులు కృష్ణమాచార్యులు, నిహాల్ అనిల్‌కుమార్, వెంకటరమణచారి, కృష్ణ, చైతన్య చారి, సంజీత్‌పాండే, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లులో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

పౌష్టికాహారంతో రక్తహీనత నివారణ



పోషకాహారం ప్రాధాన్యతను వివరిస్తున్న ఐసీడీఎస్ శబరి



ఆమనగల్లు: చిరుధాన్యాలు పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ పార్వతి

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శబరి

ఆమనగల్లు/కడ్తాల్: పౌష్టికాహారంతోనే రక్తహీనత నివారించొచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శబరి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్షంలో భాగంగా అన్నప్రాసన, అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. రకరకాల చిరుధాన్యాలతో పోషకాహారం ఏ విధంగా చేకూరుతుందో గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు వివరించారు. చిరుధాన్యాల్లో ప్రొటీన్స్, విటమిన్స్ కాల్షియం, ఐరన్ లభిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు జ్ఞానేశ్వరి, భాగ్యమ్మ, యాదమ్మ, మంగ, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, కిశోర బాలికలు, తల్లులు పాల్గొన్నారు.

నీటి సమస్యపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న ఎంపీపీ విజయలక్ష్మి

చేవెళ్ల: రోజురోజుకు ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో గ్రామాల్లో నీటి సమస్యలు రాకుండా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీపీ ఎం.విజయలక్ష్మి అన్నారు. చేవెళ్ల మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రస్తుతం ఉన్న ప్రత్యేకాధికారులు గ్రామాలకు వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకోవాలన్నారు. వేసవి కాలంలో నీటి సమస్యలపై దృష్టి పెట్టాలన్నారు. గ్రామీణ నీటి సరఫరా అధికారులు, గ్రామ ప్రత్యేకాధికారులతో కలిసి సమన్వయంగా పనిచేయాలని సూచించారు. విద్యుత్ అధికారులు విద్యుత్ సరఫరాలో ఎటువంటి సమస్యలు ఉన్నా వెంటనే పరిష్కరించాలన్నారు. ఏదైనా పెద్ద సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆమె తెలిపారు. గ్రామాల్లో సర్పంచ్‌ల పదవీకాలం ముగిసింది కాబట్టి ప్రజలకు ఎంపీటీసీలు అందుబాటులో ఉండాలన్నారు. పదో తరగతి పరీక్షల సందర్భంగా విద్యార్థులకు పరీక్ష కేంద్రాల వద్ద అధికారులు నీటి వసతి కల్పించాలని సూచించారు. మండల అభివృద్ధికి అంతా కలిసి పనిచేద్దామన్నారు.

పడకేసిన 'ప్రత్యేక' పాలన

గ్రామాల వైపు చూడని అధికారులు ● ఇష్టారాజ్యంగా పంచాయతీలు
సమయ పాలన పాటించని కార్యదర్శులు ● కార్యాలయాలకే పరిమితమవుతున్న అధికారులు


ఇబ్రహీంపట్నం రూరల్: పంచాయతీల్లో ప్రత్యేక పాలన పడకేసింది. సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. అప్పటి నుంచి వారి పర్యవేక్షణలో పాలన కొనసాగాలి. కానీ పరిపాలన అస్తవ్యస్తంగా తయారైంది. అధికారులు గ్రామాల వైపు వెళ్లకపోవడంతో కార్యదర్శులు ఆడిందే ఆట, పాడిందే పాట అన్న చందంగా మారింది. ఇబ్రహీంపట్నం మండలంలోని ఓ మేజర్ గ్రామ పంచాయతీ. దానికి బాస్‌గా ఉన్న ఓ గెజిటెడ్ అధికారిని ప్రత్యేకాధికారిగా ప్రభుత్వం నియమించింది. చార్జి తీసుకున్నప్పుడు వెళ్లిన వారు మళ్లీ గ్రామంవైపు తొంగి చూడలేదు. దీంతో గ్రామంలో జరగాల్సిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఇబ్బంది కల్గుతుంది.

పరిపాలన కుంటుపడుతుంది..



ప్రత్యేకాధికారులు గ్రామాల్లోకి వెళ్లి పనులు పరిశీలించాలి. కానీ కార్యాలయాలకే పరిమితమైపోతున్నారు. దీంతో వారు ప్రజలకు అందుబాటులో ఉండటం లేదు. ప్రతి సంతకానికి మండల హెడ్ క్వార్టర్‌కు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్యదర్శులు కూడా సకాలంలో గ్రామాలకు రావడం లేదు. – కాడిగళ్ల భాస్కర్, జిల్లా కార్యదర్శి, సీపీఎం

రోజూ గ్రామాలకు వెళ్తున్నాం...



పోచారం, ఉప్పరిగూడ గ్రామాలకు ప్రత్యేకాధికారిగా కేటాయించారు. ప్రతిరోజూ రెండు గ్రామాలకు వెళ్లి పనులు పరిశీలిస్తాను. పంచాయతీ కార్యదర్శులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తున్నాం. – ఇంద్రాసేనారెడ్డి, ఏఈ

558 గ్రామ పంచాయతీలో..

రంగారెడ్డి జిల్లాలో మొత్తం 558 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ గ్రామ పంచాయతీలకు జనవరి 2వ తేదీ వరకు సర్పంచ్‌లు ఉండేవారు. తదనంతరం పదవీకాలం ముగియడంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేకాధికారులను ప్రభుత్వం కేటాయించింది. జిల్లాలో కూడా 558 గ్రామ పంచాయతీలకు ఎంపీడీఓ, తహసీల్దార్, ఎంపీఓ, పంచాయతీరాజ్ ఏఈ, వ్యవసాయ శాఖ ఏఈ, ఏడీల స్థాయి నుంచి వివిధ శాఖలకు చెందిన గెజిటెడ్ ఉద్యోగులను పంచాయతీలకు ప్రత్యేకాధికారులుగా నియమించారు. దీంతో ఫిబ్రవరి 15వ తేదీన అధికార లాంచనాలతో బాధ్యతలు స్వీకరించారు. 558 మంది ప్రత్యేకాధికారుల్లో 58 మంది అధికారులు మినహాయిస్తే మిగతా 500 మంది వరకు నేటికి గ్రామాలకు వెళ్లలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అసలే ఎండకాలం ఓ వైపు తాగునీటి ఎద్దడి, మార్చిలో పన్నుల వసుళ్లు, ఎమర్జెన్సీ పనులు చేయాల్సి వస్తుంది. కార్మికుల జీతాలు వంటి కార్యక్రమాలు చేయాలన్నా ప్రత్యేకాధికారులు అందుబాటులో ఉండాలి. కానీ అధికారులు సక్రమంగా రాకపోవడంతో పంచాయతీల్లో పనులు సాగడం లేదు. మండల హెడ్‌క్వార్టలకే ప్రత్యేకాధికారులు పరిమితమైపోతున్నారు. ఏమైన పనులు చేయాలన్నా, సంతకాల కోసమైనా నేరుగా హెడ్‌క్వార్టర్‌లో ఉన్న మండల ప్రజాపరిషత్తు కార్యాలయాలకు వెళ్లాల్సి వస్తుంది.



పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులు

కారోబార్‌ల చేతుల్లో కార్యదర్శులు

సర్పంచ్‌లు లేక, ప్రత్యేకాధిరులు గ్రామాలకు వెళ్లకపోవడంతో పంచాయతీ కార్యదర్శులు ఆడిందే ఆట పాడిందే పాట అన్నట్లుగా ఉంది. పల్లె ప్రగతిలో భాగంగా ప్రతి గ్రామానికి పంచాయతీ కార్యదర్శులు ఉదయం 9 గంటలకే చేరుకోవాలి. కానీ కొద్ది మంది మినహాయిస్తే మెజార్టీగా ఎవరూ కూడా సమయానికి రావడం లేదు. చాలా మంది పంచాయతీ కార్యదర్శులు రెండు రోజులకు ఓ సారి చుట్టపు చూపులాగా వచ్చిపోతున్నారు. ఒకే రోజు వచ్చి అన్ని సంతకాలు పెట్టి పోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే డీఎస్ఆర్ ప్రతి రోజు పల్లె ప్రకృతి వనం, నర్సరీ, గ్రామ పంచాయతీ, శ్మశాన వాటికతో పాటు, మురుగునీరు, రోడ్డు ఉన్న చోటకు వెళ్లి లైవ్‌లో లోకేషన్లు డీఎస్ఆర్‌లో అప్‌లోడ్ చేయాలి. కానీ అదికూడా తప్పుదారి పట్టిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి వద్ద ఉండాల్సిన యాప్ కారోబార్‌లచేతుల్లోకి వెళ్లింది. వారే ఫొటోలు తీసి అప్‌లోడ్ చేస్తున్నారని చెబుతున్నారు. ఇలా అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న కనీసం పట్టించుకోవడం లేదని ఆరోపణలు గుప్పుమంటున్నాయి.